ఆంధ్రప్రదేశ్ శాసన మండలి

ప్రసంగం

# శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్

ఆంధ్రప్రదేశ్ గవర్నరు

31 జ్యేష్ఠ, 1936

21 జూన్, 2014

గౌరవ అధ్యక్షా,
స్పీకర్ మహాశయా,
గౌరవనీయులైన శాసనమండలి సభ్యులారా !

శాసనమండలికి ప్రతినిధులుగా ఎన్నికైన సభ్యులందరికీ మొదట నా శుభాకాంక్షలు. నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి తొలి ఉమ్మడి సమావేశానికి మీరందరినీ ఆహ్వానిస్తున్నాను. స్థిరత్వం, నిజాయితీ, అభివృద్ధికి ఓటువేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజల వివేకాన్ని ప్రశంసిస్తున్నాను. ప్రజాస్వామ్యంలో ప్రజలు దేవుళ్లు అని వారికి సేవ చేయడం మన మొదటి ప్రాధాన్యత అని దూరదృష్టిగల నాయకులు శ్రీ ఎన్.టి. రామారావుగారు ఇచ్చిన వివరణ పాలనా యంత్రాంగానికి మార్గదర్శక సూత్రంగా ఉంటుంది.

సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించాలనే నిర్ణయం మరియు విభజన చేసిన తీరు తీవ్ర అసంతృప్తిని, చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. అధిక భాగం ప్రజల మనోభావాలు, ఆకాంక్షలు, ఆశలు నెరవేరలేదు. అశాస్త్రీయ విభజన తీరు తెలుగు ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది. ఈ గాయాలు మానటానికి కొంత సమయం పడుతుంది.

జనాభాలోని అధిక భాగం మినహాయింపు పాలనా వ్యవస్థకు శుభసూచకం కాదు. ఆస్తులు, అప్పుల పంపిణీ, విద్యుత్తు ఉత్పత్తి యూనిట్ల కేటాయింపు, సిబ్బంది పంపిణీలో అనుసరించిన కార్యవిధానం మరియు సరిహద్దులను గుర్తించడానికి సంబంధించి అసమ్మతి, అసంబద్ధత వల్ల

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విషయాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది. రుణాన్ని విభజించడం, విద్యుత్తును పంచడం, విద్యారంగంలోని విషయాలు, కేడరును మరింత న్యాయబద్ధంగా పంపిణీ చేయడం కోసం మరింత స్థిరమైన విధానం మరియు నిర్థిష్ట ఏకరూపత అవసరం ఉంది.

తెలుగు ప్రజలు అస్తవ్యస్థ రాష్ట్ర ఏర్పాటు చరిత్రను చవిచూశారు. ప్రస్తుత విభజన వారి మనసులను, మనోభావాలను మరోసారి తీవ్రంగా గాయపరిచింది. తెలుగు ప్రజలు వారి స్వయం గుర్తింపు నిమిత్తం మద్రాసు నుండి కర్నూలుకు, ఆ తర్వాత భాషా ప్రాతిపదికపై హైదరాబాదుకు మారవలసి వచ్చింది. ఇప్పుడు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు చెప్పుకోవడానికి రాజధాని లేదు. రాజకీయ అస్థిరత వల్ల తరచుగా తెలుగు ప్రజలు అభివృద్ధికి, పురోగతికి దూరంగా ఉండిపోయారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం 2014, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో చేసిన నిబంధనలు తగినంతగా లేవు. అవకాశాల నష్టాన్ని సరిచేసేందుకు పరిహారాన్ని చూపలేదు. ఫలితంగా రాష్ట్రం తీవ్ర ప్రతికూల స్థితిలోకి వెళ్లింది. కొత్త రాష్ట్ర అభివృద్ధి కోసం ఆదాయ సముపార్జన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం, విద్యా సంస్థలు, ఆర్ & డి, శిక్షణా సౌకర్యాలు మరియు సామాజిక మౌలిక సదుపాయాలు అవసరాలకు తగ్గట్టుగా లేవు. విభజన ప్రక్రియలో కీలకమైన నూతన రాజధాని విషయాన్ని ఇంకా పరిష్కరించాల్సి ఉంది. దీనివల్ల నివారించదగు అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

1995-96లో 2వ తరం సంస్కరణలు ప్రారంభించబడిన సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధిని పెంచి దారిద్ర్యాన్ని నిర్మూలించడం కోసం దాదాపు ఒక దశాబ్ధం పాటు కఠినంగా ఆర్థిక సంస్కరణలు అమలయ్యాయి. 1990 దశాబ్ధం మధ్యలో సమాచార, సాంకేతిక రంగాల్లో మార్పు వచ్చింది. ఈ కాలంలో భూమి, నీరు, అటవీ వనరుల భాగస్వామ్య నిర్వహణ విషయంలో గణనీయమైన మార్పులు చేయడం జరిగింది. మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహిళా, స్వయం సహాయక బృందాలు మరియు డ్వాక్రా గ్రూపులు, ప్రపంచ విజయగాధగా నిలిచాయి. వీటి ద్వారా సామాజిక సమీకరణ, సామాజిక సాధికారత, సామర్థ్య నిర్మాణం పేదరిక నిర్మూలన విధానంలో కీలకంగా మారాయి. ఈ చర్యలు ఆర్థిక సంస్కరణలలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తెచ్చిపెట్టాయి. దేశవిదేశాలలో అంచనాలు పెరగడానికి దారితీశాయి. అయితే ప్రభుత్వం నుండి తగినంత మద్దతు లేకపోవడం వల్ల ఈ బృహత్తర ఉద్యమం 2004 నుండి వేగంగా క్షీణించడం ప్రారంభమయింది.

దురదృష్టవశాత్తు గత దశాబ్ధంలో రాష్ట్ర ఆర్థిక విషయంలో ముఖ్యంగా సహజ వనరుల కేటాయింపు అంశంలో అనేక అవకాశాలను కోల్పోవడం జరిగింది. ప్రభుత్వ ఆర్థిక వనరులను పెంచుకోవడంలో అలాగే, ప్రభుత్వ రాబడి వృథాను అరికట్టడంలో విఫలమవడం జరిగింది. విపరీతమైన అవినీతి రాష్ట్ర అభివృద్ధి ప్రక్రియకు అవరోధం కలిగించిందని అధిక భాగం ప్రజలు గ్రహించారు. ఇవి రాష్ట్ర అభివృద్ధిని ఆటంకపరిచి, అవకాశాలను లేకుండా చేశాయి. పటిష్ఠవంతమైన వ్యవస్థలను రూపొందించి, అమలు చేయడంలో విఫలమవడం వల్ల దాని ప్రభావం

పరిపాలనపై ఉంటుంది. విశ్వాసపాత్రమైన బాధ్యత ప్రతి ప్రభుత్వంపై ఉంటుంది. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు నిజమైన సంరక్షకునిగా పనిచేయాలని ఆశించడమవుతున్నది. సహజ వనరులైన భూమి, అటవీ సంపద, ఖనిజాలు, గనులు వంటి అనేక అంశాలలో మరియు ప్రజా పనులలో ముఖ్యంగా సాగునీరు, సెజ్‌లలో లంచగొండితనం విషయంలో ప్రభుత్వ విధానానికి, ప్రభుత్వ పనితీరుకు సంబంధించి లోపాలు అలాగే వైఫల్యాలను పరిశీలించాలని నా ప్రభుత్వం భావిస్తున్నది. అవసరమైన అన్ని దిద్దుబాటు చర్యలను తీసుకొంటుంది. ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఉండేలా చూడడానికి ప్రక్రియలు సక్రమంగా ముగిసేలా చర్యలు తీసుకుంటాము. పైన పేర్కొన్నట్టి కేసులలో గత ప్రభుత్వం తీసుకున్న ప్రధాన పెట్టుబడుల నిర్ణయాలను సమీక్షించేందుకు మంత్రివర్గ ఉప-సంఘాన్ని ఏర్పాటు చేయడమయింది.

గత దశాబ్దంలో ఆర్థిక అవకాశాల నష్ట తీవ్రతను ప్రజలకు తెలియపరచేందుకు వీలుగా కీలక రంగాలపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని నా ప్రభుత్వం నిర్ణయించింది. మానవ వనరుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, ఆర్థిక వనరుల సమీకరణ రంగాలకు సంబంధించిన ముఖ్య మైన సామాజిక, ఆర్థిక ప్రమాణాల క్రింద ఈ శ్వేత పత్రాలు స్థితిని, పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. ప్రజలు విషయాల యోగ్యతలను నిర్ణయించుకొనే అవకాశాన్ని కలిగివుంటారు. ప్రభుత్వ ఖజానాకు ప్రతికూల ప్రభావం కలిగించే అంశాలను తెలుసుకొంటారు.

వనరులను వ్యర్థపరచడం, సక్రమంగా లేని పాలనతోపాటు విభజన ప్రక్రియ వల్ల రాష్ట్రంపైన మరియు అవ్యవస్థంగా ఉన్న రాష్ట్రం వనరులపైన ప్రతికూల ప్రభావం పడింది. ప్రణాళికేతర రాబడికి సంబంధించినంత వరకు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉంది. దురదృష్టవశాత్తు విభజన వల్ల అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రణాళికేతర పద్దు క్రింద రూ. 15,000 కోట్లకు పైగా రెవెన్యూ లోటు ఏర్పడింది. కేవలం విభజన వల్ల రాష్ట్ర స్వంత రెవెన్యూలో జీతాలు, పింఛనుల బాధ్యత సుమారు 52 శాతం నుండి 73 శాతానికి పెరిగింది. అర్థవంతమైన ప్రణాళిక వ్యయం కోసం రాష్ట్రానికి తగిన వనరులు లేవు. రుణాన్ని జనాభా నిష్పత్తిలో కేటాయించినందువల్ల దానిని తీర్చడం కష్టం కానున్నది.

రాష్ట్ర విభజనలో అనుసరించిన విధానం ఆంధ్రప్రదేశ్‌కు ప్రతికూలంగా వుంది. రాష్ట్రం అన్ని ప్రధాన ఆర్థిక ఆస్తులను కోల్పోయింది. రుణాన్ని తీర్చే స్థోమత లేకపోగా రుణ బాధ్యత ఏర్పడింది. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటూ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడనున్నది. జాగ్రత్తగా వ్యవహరిస్తేనే తప్ప ఈ ప్రతికూల ప్రభావం కొంతకాలంపాటు ప్రజలను ముఖ్యంగా పేదలను, రైతులను, బలహీన వర్గాలను వెంటాడే అవకాశం ఉంది.

2014, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 10వ షెడ్యూలులో గల ఎక్కువ భాగం సంస్థలు అంతిమంగా తెలంగాణ రాష్ట్రానికి చెందుతాయి. ఫలితంగా అవశేష రాష్ట్రానికి ప్రతికూల పరిస్థితి ఏర్పడుతుంది. ఆ

సంస్థలను క్రింది స్థాయి నుండి పునర్ నిర్మించుకోవలసి ఉంటుంది. ప్రధాన కార్యస్థానాలతోపాటు ఎక్కువ భాగం రాష్ట్ర సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన ఆస్తులు హైదరాబాదులో ఉన్నాయి. విభజించదగు ఈ ఆస్తులను న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా పంచుకోవడానికి సంబంధించిన విధానాన్ని ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో స్పష్టంగా పేర్కొనలేదు. ఫలితంగా క్రింది స్థాయి నుండి ప్రారంభించాల్సి ఉన్నందున ఆ సంస్థలను తిరిగి నిర్మించడానికి ఎక్కువ సమయం అవసరం కావడం, వనరుల కొరత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర ప్రతికూల అంశంగా ఉంటుంది.

1956 నుండి రాజధాని నగరమైన ఒక్క హైదరాబాదులోనే కేంద్ర ప్రభుత్వం రూ. 1.40 లక్షల కోట్ల ప్రజా పెట్టుబడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ. 5.80 లక్షల కోట్ల పెట్టుబడి మరియు ప్రైవేటు రంగం రూ. 6.00 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టినట్లు అంచనా వేయబడింది. తదనుగుణంగా సహాయ చర్యగా తగినంత పరిహారాన్ని సమకూర్చలేదు. ఫలితంగా విభజన ప్రతికూల ప్రభావం రాష్ట్రంపైన దాని వనరుల పైన రాబోయే చాలాకాలంపాటు ఉంటుంది. మా ముందున్న సవాలును తేలికగా తీసివేయలేము. ఇది ఒక పెనుసవాలు.

ముఖ్యంగా ప్రభుత్వ వనరులకు సంబంధించి మరింత సమానమైన, న్యాయబద్ధమైన విభజన జరిగి వున్నట్లయితే మనం ప్రస్తుత తీవ్ర ప్రతికూల పరిస్థితిలో ఉండేవారంకాము. లోపాలను, తప్పులను సరిచేసి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సరియైన న్యాయం చేయవలసిందిగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం

నుండి మద్ధతును, ఉదార సహాయాన్ని కోరతాము. అందువల్ల, రెవెన్యూ, మౌలిక సదుపాయాల భారీ లోటును పూడ్చుకుంటూ క్రింది స్థాయి నుండి రాష్ట్రాన్ని నిర్మించవలసి ఉంటుంది. అధికంగా ఉన్న వనరుల వ్యత్యాసాన్ని సరిదిద్దడం నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సులభం కాదనే విషయంలో మీరు నాతో ఏకీభవిస్తారని విశ్వసిస్తున్నాను. సమానావకాశాలు సాధించేంత వరకు కేంద్ర ప్రభుత్వ ఉదారమైన ఆర్థిక, నైతిక మద్దతు అందినపుడు మాత్రమే ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుంది. పొరుగు రాష్ట్రాలతో సమానంగా మనుగడ సాగించి, అభివృద్ధి చెందడానికిగాను కొత్త రాష్ట్రం ప్రధాన అవసరాలను మదింపుచేసి, పరిస్థితిని సరిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న వివిధ సంస్థలు, మౌలిక సదుపాయ ప్రాజెక్టులను సత్వరమే ప్రారంభించేటట్లు చూడడంతోపాటు సముచిత ఉదార ఆర్థిక సహాయం, విధానపరమైన మద్దతుతో ఆంధ్రప్రదేశ్ వృద్ధి, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సమానావకాశాలను కల్పించాల్సి ఉంటుంది. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో సమానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదాయాన్ని ఆర్జించి, తమ పౌరులకు అన్ని సౌకర్యాలను సమకూర్చగలిగేంత వరకు ఈ మద్దతును కొనసాగించాలి.

రాష్ట్ర విభజన ఫలితంగా రాబడి పెరుగుదలకు ఏర్పడే విఘాతం కారణంగా ఉత్పన్నమైన ప్రణాళికేతర లోటును పూరించడానికి, ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కారణంగా ఏర్పడిన అదనపు చెల్లింపు కోసం 2014, జూన్ నుండి 2015, మార్చి వరకు గల వ్యవధి కోసం రాబోవు కేంద్ర

బడ్జెటులో ఇతర ఆర్థికపరమైన ప్రతిపాదనలతోపాటుగా రూ.15,000 కోట్లకు పైబడిన ఒక ప్రత్యేక గ్రాంటును సమకూర్చవలసిందిగా నా ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుంది. సమానావకాశాలు సాధించేంత వరకు దీనిని కొనసాగించవలసి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటగిరీ రాష్ట్ర హోదాను ఇచ్చే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం శీఘ్రతరం చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లోని 9 కోస్తా జిల్లాలు తుఫాను వల్ల అత్యంత వెనుకబడి, ప్రతికూల ప్రభావానికి గురి అయ్యాయి. కాగా, మిగిలిన 4 జిల్లాలు దేశంలోనే రెండవ అతిస్వల్ప వర్షపాతం కలిగిన అనంతపురం వంటి జిల్లాలతో వర్షాభావ ప్రాంతంలో ఉన్నాయి. ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు ప్రత్యేక పెట్టుబడులు, దృష్టి అవసరమవుతాయి. విభజన అనంతర ఆర్థిక ఇబ్బందులను, సవాళ్ల నుంచి బయటపడటానికి రాష్ట్రాన్ని ప్రత్యేక కేటగిరీ రాష్ట్రంగా చేర్చడం దోహదకారికాగలదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను అనుసరించి పదిహేను సంవత్సరాల కాలానికి పారిశ్రామిక ప్రోత్సాహకాలు, రాయితీలను మంజూరు చేయవలసిందిగా కూడా నా ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుంది.

కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం నుండి మరొక ముఖ్యమైన అభ్యర్థన ఏమిటంటే ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో హామీ ఇచ్చినట్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని ఆమోదించడం. అట్టి ప్యాకేజీ క్లిష్ట పరిస్థితిలో ఉన్న ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీగా ప్రస్తుత సంవత్సరపు

కేంద్ర బడ్జెటులో అవసరమైన ఆర్థిక కేటాయింపును సమకూర్చవలసిందిగా మేము కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతాం.

దీనికి అదనంగా, ప్రస్తుతం నిర్వహణలో ఉన్న కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం కోసం, విభజన ఫలితంగా ఉత్పన్నమైన ముఖ్యమైన అభివృద్ధి అవసరాలను తీర్చడం కోసం కేంద్రం నుండి అదనపు కేంద్ర సహాయంగా రూ. 8,600 కోట్లకు పైబడిన ప్రత్యేక గ్రాంటును కూడా కోరడమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆర్థిక బాధ్యత, బడ్జెటు నిర్వహణ (ఎఫ్ఆర్బిఎం) చట్టం సడలింపు, కేంద్ర ప్రభుత్వ రుణాల చెల్లింపు నుండి ఉపశమనం, నూతన రాజధాని నగరానికి సహాయం, కీలక మౌలిక సదుపాయాలు, పోలవరం సాగునీటి ప్రాజెక్టు, సంస్థలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు వంటి సంబంధిత అంశాలను కూడా సత్వర, సానుకూల మద్దతు కోసం కేంద్రానికి పంపడమవుతుంది.

రాజధాని నగరం ప్రకటన ఇంకా అనిశ్చితిలో ఉన్నందున, నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మౌలిక సదుపాయాలు, ఉద్యోగులు, తీవ్ర ఆర్థిక ఒత్తిడి, ఆర్థికపరమైన లోటులు పేరుకుపోవడం, ఇతర అత్యవసర అంశాలు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నందున క్రింది స్థాయి నుండి ప్రారంభించి మేము ముందుకు వెళ్ళాల్సి ఉంది. నా ప్రభుత్వం ధృఢ సంకల్పం, ప్రజల మద్దతు, కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో వాగ్దానాలను నెరవేర్చాలని నిర్ణయించింది.

2వ ప్రపంచ యుద్ధం తరువాత భయంకరమైన విధ్వంసం నుండి కోలుకున్న జపాను, ఒక చిన్న మత్స్యకార గ్రామం నుండి విలక్షణంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా అద్భుతంగా రూపొందిన సింగపూరు, ఇంకా అనేక ఉదాహరణలను మనం గుర్తు చేసుకొని, ప్రేరణ పొందుదాం. నూతన రాష్ట్ర నిర్మాణ విధానం రాష్ట్ర నిర్మాణ ప్రజల ఉద్యమంగా ఉంటుంది. వాస్తవానికి, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఇప్పటికే నూతన రాజధాని నిర్మాణం కోసం ఉదారంగా, స్వచ్ఛందంగా విరాళాలివ్వడం ప్రారంభించారని మీరు తెలుసుకోవచ్చు. ఎటువంటి రాజకీయ అజెండా లేకుండా ఉత్తమ కారణం కోసం పనిచేయవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలను నా ప్రభుత్వం మనః పూర్వకంగా కోరుతున్నది.

తెలుగు మాట్లాడే ప్రజలందరిలో వారి భౌగోళిక స్థానికతతో నిమిత్తం లేకుండా ఐకమత్యంతో కొనసాగడానికి సామరస్యాన్ని తేవాలని నా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలను చేస్తుంది. క్రొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, దేశ ఖజానా, జాతి నిర్మాణం, వృద్ధిలో పెద్ద ఎత్తున తనవంతు పాత్రను పోషించే రోజు ఎంతో దూరంలో లేదు.

భారత ప్రజానీకం వివిధ ప్రాంతాలలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడి నాయకత్వంలో సుపరిపాలన, అభివృద్ధి, ఒక కొత్త శకాన్ని ప్రవేశపెడుతుందని సామూహికంగా ఎన్నుకున్నారు. అవినీతిరహిత, సుపరిపాలన పద్ధతులను ప్రారంభించడానికి నా ప్రభుత్వం వ్యూహాలను రూపొంధిస్తుంది. చిన్న ప్రభుత్వం ఎక్కువ పరిపాలన అనే సిద్ధాంతం త్వరలో వాస్తవం అవుతుంది. ప్రజలు వారి రక్షణ, భద్రత గురించి ప్రజల

మనసులో వున్న అపోహలను తొలగించడానికి నా ప్రభుత్వం తగిన చర్యలను తీసుకుంటుంది.

అభివృద్ధి, సంక్షేమం, అవినీతిరహితపాలన వంటి ముఖ్యమైన అంశాలలో మా ప్రాధాన్యతలు, వ్యూహాలు, అభివృద్ధి ధృక్పదాలు, ప్రమేయాలు వంటి కొన్నింటిని తెలియజేయనివ్వండి.

ఒక క్రొత్త ప్రభుత్వ విధానాన్ని రూపొందించాలని నా ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో అనేక వాణిజ్య కేంద్రాలు వికేంద్రీకరణ, అభివృద్ధిపై దృష్టి సారించడమవుతుంది. ఒక సమగ్ర అభివృద్ధి వ్యూహంలో భాగంగా పెట్టుబడులను ఆకర్షించడమవుతుంది. తయారీ రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్య, నాలెడ్జి, ఐటి, పారిశ్రామిక, లాజిస్టిక్ హబ్‌లుగా వివిధ నగరాలను అభివృద్ధి చేయడమవుతుంది.

లక్ష్యాన్ని చేరుకోవడం కోసం పరిపాలనను క్రమబద్ధంలోకి తీసుకురావడానికి ఒక వంద రోజుల అభివృద్ధి కార్యక్రమాన్ని నా ప్రభుత్వం ప్రారంభించింది. భారతదేశం @ 75 గుర్తుగా 2022 నాటికి దేశంలోని మూడు ఉత్తమ నిర్వహణ రాష్ట్రాలలో ఈ రాష్ట్రానికి స్థానం కల్పించడానికి మారిన పరిస్థితులతో నూతన అభివృద్ధి విధానం కోసం ప్రమాణాలను నిర్ణయించే దృక్పధాన్ని రూపకల్పన చేయడం కోసం విజన్ 2020 డాక్యుమెంటును మేము పునర్ రచిస్తాం. తదుపరి మూడు ఆర్థిక సంఘాలతో 2029 నాటికి పౌర జీవన సంతృప్తి, సంతోష సూచికలపరంగా అంచనా వేసి ఆంధ్రప్రదేశ్‌ను ఒక అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మలచడమే నా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తర కోస్తా జిల్లాల కోసం వాటి సహజసిద్ధ వనరుల ఆధారతను దృష్టిలో ఉంచుకొంటూ ఒక ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను నా ప్రభుత్వం రూపొందిస్తుంది. వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించి రైతాంగానికి సహాయపడడం అనే విషయాల చుట్టూ నా దృష్టి కేంద్రీకృతమై ఉంది. తరుచుగా సంక్షోభాలకు గురిఅవుతున్న వ్యవసాయరంగం లక్షలాది రైతాంగ కుటుంబాలకు మద్ధతునిచ్చే ఉపాధిలో ప్రధాన వనరుగానే ఉంది. రైతుల బాధలకు ముగింపు పలకడానికి నా ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకొంటుంది. ఈ దిశగా తక్షణ చర్యను ప్రారంభిస్తూ నా ప్రభుత్వం రైతులకు రుణమాఫీని ప్రకటించింది. బ్యాంకర్లతో సాధ్యమగు అత్యుత్తమ ప్రత్యామ్నాయలను రూపొందిస్తున్నది. రైతులకు విభిన్న రకాల రుణాలకు సంబంధించిన అంశాలను పరిశీలించడానికి ఒక కమిటీని నియమించాం. ఈ విషయంలో తక్షణమే వేగవంతంగా ఒక విధానాన్ని రూపకల్పన చేయడానికి ఆర్‌బిఐ, బ్యాంకర్లతో చర్చలు జరుగుతున్నాయి. రైతుల వ్యధను, రుణభారాన్ని తగ్గించడానికి ఒక ప్యాకేజిని ప్రకటించడానికి సంఘం నివేదిక ఒక సదుపాయాన్ని కల్పిస్తుంది. అదనంగా అణగారిన వర్గాల కోసం భూముల కేటాయింపు, క్రమబద్ధీకరణ కోసం నూతన భూవిధానాన్ని రూపొందించడమవుతుంది.

రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాల సరఫరాను కట్టుదిట్టం చేయడం, ఆహార భద్రతను సాధించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయంతో ఒక ప్రాంత నిర్ధిష్ట వ్యూహాలను రూపొందించడం, సూక్ష్మ పోషక లోపాలను నియంత్రించడం,

ఉద్యానవన పంటలు, పశుగణసంపద, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, మత్స్య పరిశ్రమలను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలపై దృష్టిసారిస్తూ ఒక నిశ్చయాత్మక సుస్థిర విధానంలో వ్యవసాయరంగంలో చాలా కాలంగా వున్న సంక్షోభాన్ని అధిగమించాలని కృత నిశ్చయంతో ఉన్నాం. నిల్వ, కోల్డ్ స్టోరేజి, ప్రాసెసింగ్ వంటి పంట కోత అనంతర నిర్వహణపై దృష్టి పెట్టడమవుతుంది. గిట్టుబాటు ధరలను పొందడంలో రైతులకు సహాయం చేయడం కోసం నా ప్రభుత్వం ఒక మార్కెటు ఇంటర్‌వెన్షన్ నిధిని కూడా ఏర్పాటు చేస్తుంది. అందుమూలంగా ధరల హెచ్చుతగ్గులలోని తారతమ్యాలను నిరోధించడానికి వీలవుతుంది. ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయంతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏకీకరణను చేయడానికి నా ప్రభుత్వం చర్యలను ప్రారంభిస్తుంది. సమగ్ర వ్యవసాయ అభివృద్ధిని కట్టుదిట్టం చేసే ఉద్దేశ్యంతో నా ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం ప్రత్యేక బడ్జెటును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సంభవించగల అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొని, రాబోయే ఖరీఫ్ కోసం సన్నాహాలు చేసుకోవడానికి మేము వ్యూహాలను రూపొందిస్తున్నాం.

సహజ వనరుల నిర్వహణ కోసం ఎగువ నుండి దిగువ స్థాయి వరకు స్థూల వాటర్ షెడ్‌లో నీటి నిర్వహణను, నీటి వినియోగ సమర్థత అంశాలను చేర్చడమవుతుంది. ప్రతి నీటి బొట్టును పరిరక్షించి, నీటి వినియోగాన్ని గరిష్ఠ తరం చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. తక్కువ నీటిని వినియోగిస్తూ ఉత్పత్తిని పెంచడం కోసం బిందు / తుంపర

సేద్యపు పద్ధతులను పెంపొందించడమవుతుంది. భూసార పరీక్షలపై ఆధారపడి, ఉత్పత్తిని పెంచడం కోసం సూక్ష్మ పోషకాలను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడమవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, అధిక దిగుబడినిచ్చే రకపు విత్తనాలను ఉపయోగిస్తూ ఉద్యానవన పంటలు, వాణిజ్య పంటలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వడమవుతుంది.

నా ప్రభుత్వం రైతులకు రోజుకు 9 గంటల నాణ్యమైన విద్యుత్తును ఉచితంగా సమకూరుస్తుంది. నా ప్రభుత్వం షేడ్-నెట్, గ్రీన్-హౌస్ టెక్నాలజీలను రైతుల ముంగిటకు తీసుకువస్తుంది. నా ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్‌ను, ప్రతి జిల్లాలో ఒక మెగా ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పండే పంటల స్వభావంపై ఆధారపడి ప్రతి జిల్లాలో శీతల గిడ్డంగులు / గోదాము సదుపాయాలను కల్పించాలని మేము ప్రణాళికను రూపొందిస్తున్నాం.

వ్యవసాయానికి అత్యవసరమైన సాగునీటికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడాన్ని కొనసాగిస్తాం. సాగు క్రిందకు అధిక విస్తీర్ణాన్ని తీసుకురావడానికి తక్కువ పెట్టుబడితో పెండింగు ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడానికి ప్రాధాన్యతనివ్వడం కోసం నా ప్రభుత్వం అట్టి ప్రాజెక్టులను సమీక్షిస్తుంది. నీటి నిల్వ నిర్మాణాలను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ నీటిని సంరక్షించడమవుతుంది.

రెండు కొత్త రాష్ట్రాలు, ఇతర ఎగువ నదీ సంబంధ రాష్ట్రాల మధ్య నీటిని న్యాయోచితంగా పంచుకునేటట్లు చూడడానికి, ఆంధ్రప్రదేశ్ పునర్

వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచినట్లుగా కృష్ణా, గోదావరి నదులకు రెండు నదీ నిర్వహణ బోర్డులను తక్షణమే ప్రకటించి, ఏర్పాటు చేయాలనీ, తుంగభద్ర బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని మేము కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతాం.

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఇప్పటికే ప్రకటించినందున, నిర్ణీత కాల వ్యవధిలో ఈ మెగా ప్రాజెక్టును పూర్తి చేసిన తరువాత హామీ ఇచ్చిన నీటిని సరఫరా చేస్తామనే నమ్మకంతో ఉన్నాం. వాస్తవానికి మునుపటి ఆంధ్ర ప్రాంతానికి చెందిన ప్రాంతంలోని కొంతభాగమైన ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను మాత్రమే ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేసింది. ఈ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల అవస్థలను నా ప్రభుత్వం పూర్తిగా పరిష్కరిస్తుంది.

దేశంలోని అవ్యవస్థీకృత రంగం జాతీయ ఆదాయంలో దాదాపు 45 శాతం ఆదాయాన్ని సమకూరుస్తున్నదని తాజా నిదర్శనాలు వెల్లడిస్తున్నాయి. తయారీలో అవ్యవస్థీకృత రంగం దాదాపు 35 శాతంగా ఉంటూ, తయారీ కార్యకలాపంలో దాదాపు 41 శాతం విలువను పెంచుతున్నాయని కూడా వెల్లడవుతుంది. కార్పొరేట్‌యేతర రంగం సేవా కార్యకలాపాలపై కూడా ఆధిపత్యం వహిస్తున్నది. దానిని "ఇంజన్ ఆఫ్ అవర్ ఎకనామిక్ గ్రోత్" గా పిలవబడుతున్నది. రాష్ట్రంలోని దాదాపు 47 శాతం కుటుంబాలు ఇప్పటికీ బ్యాంకింగు సదుపాయాలను కలిగి ఉండలేదు. అందువల్ల, వారి యొక్క పెట్టుబడి అవసరాలను పొందడానికి ఏదేని అనియత సంస్థాగత పరపతిని పొందలేకపోతున్నారు. ఇంకనూ, దాదాపు 40

శాతం మేరకు పొదుపు ఖాతాలు అనియత రంగానికి జమ అవుతున్నాయి. ఈ రంగం యొక్క క్లిష్టతను, తోడ్పాటును దృష్టిలో వుంచుకొని నా ప్రభుత్వం ఆర్థిక సమీకరణ కోసం తగిన విధాన ప్రత్యామ్నాయాలను చేర్చడానికి కృషి చేస్తుంది. అంతేకాకుండా, ధరల హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణ ధోరణిల నుండి ప్రజలకు ఉపశమనం కలుగజేయడానికి ధరల పర్యవేక్షణ యంత్రాంగాన్ని, ధరల స్థిరీకరణ నిధిని కూడా నా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఉచిత భోజనాన్ని సమకూర్చడం కోసం అన్ని ప్రధాన దేవాలయాలలో అన్నదానం పథకాన్ని కూడా నా ప్రభుత్వం ప్రారంభిస్తుంది.

కొత్త రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడానికి నా ప్రభుత్వం ఆటంకంలేని, సహాయకార వాతావరణాన్ని కల్పిస్తుంది. రోడ్లు, రవాణా వ్యవస్థ, సరుకుల (కార్గో) రవాణా వ్యవస్థ, రైల్వే వ్యవస్థ, ఓడరేవులు, విమానాశ్రయం, స్వేచ్ఛా వాణిజ్య కేంద్రాలు, నీటి రవాణా వ్యవస్థ, టెలీకమ్యూనికేషన్లు, ఆప్టికల్ ఫైబర్ వ్యవస్థలు వంటి నమూనా మౌలిక సదుపాయాల పర్యావరణాన్ని ఏర్పాటు చేయడంపై మా దృష్టిని సారించడమవుతున్నది. సత్వర నిర్ణయాలను తీసుకొని, తాజా సాంకేతిక విజ్ఞానాన్ని వర్తింపచేస్తూ పారదర్శక పరిపాలనను కట్టుదిట్టం చేయడమవుతుంది.

సేకరించిన భూమిలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులో ఒక కొత్త యాజమాన్య స్నేహపూర్వక భూమి అభివృద్ధి విధానాన్ని తీసుకురావాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. తద్వారా అభివృద్ధి ప్రక్రియలో అతను భాగస్వామిగా వుంటాడు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీలలో

ఆంధ్రప్రదేశ్ సముచితమైన వాటాను పొందేలా నా ప్రభుత్వం చర్య తీసుకొంటుంది. 3 మెగా సిటీలను, 12 ఇతర నగరాలను అభివృద్ధి చేయడమే మా ప్రణాళిక.

ఆంధ్రప్రదేశ్‌లోని వ్యూహాత్మక భౌగోళిక ప్రాంతం, ప్రస్తుతం ఉన్న దాదాపు 15 మరియు కొత్త ఓడరేవులతో 972 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతాన్ని ఉపయోగించుకుని పి.పి.పి.మార్గం ద్వారా కూడా నూతన వృద్ధి కేంద్రాలను అభివృద్ధి చేయడం, మచిలీపట్నం ఓడరేవు ద్వారా వృద్ధిని వేగవంతం చేయడమవుతుంది. విశాఖపట్నం, కాకినాడల వద్ద రెండు ఎల్.ఎన్.జి టెర్మినల్‌ను అభివృద్ధి చేయడమవుతుంది.

ఉద్యోగాలను కల్పించడం కోసం, గుర్తించిన రంగాలకు గ్రోత్ కారిడార్‌లను ఏర్పాటు చేయడంపై కేంద్రీకరించడం ద్వారా, రాబోయే దశాబ్ద కాలంలో 10 శాతానికిపైగా వార్షిక వృద్ధిరేటును సాధించడానికి నా ప్రభుత్వం అన్ని చర్యలను చేపడుతుంది. ఈ గ్రోత్ కారిడార్‌లకు రవాణా సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, విద్యుత్తు, నీటి వనరులు మరియు ఇతర సౌకర్యాలు అవసరమవుతాయి. ఈ గ్రోత్ కారిడార్‌లకు ఓడరేవులు, రోడ్డు, రైలు, మౌలిక సౌకర్యాలు, ముడిసరుకు వనరుతో ఏకీకృతం చేసి అనుసంధానం చేయడమవుతుంది. ఈ విధానపరమయిన చర్యలతో, రాష్ట్రాన్ని ప్రపంచ శ్రేణి తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది.

గృహ, పారిశ్రామిక రంగం రెండింటికి 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా చేయడం కోసం మేము కృషి చేస్తాం. సౌరశక్తి, పవన విద్యుత్తు,

జల విద్యుత్తు అందుబాటులో ఉన్నచోట అట్టి అనువైన ప్రాంతాలను నా ప్రభుత్వం ప్రత్యేక విద్యుత్తు ఉత్పాదన ప్రాంతాలుగా ప్రకటిస్తుంది. పరిశ్రమలు, విద్యుత్తు, రసాయన ఎరువుల కోసం కేంద్ర ప్రభుత్వం నుండి ఇంధన వాయువు కేటాయింపును పొందడమవుతుంది. రాయితీలను కల్పించడం ద్వారా వ్యవసాయం, గృహ అవసరాలు, కుటీర పరిశ్రమలకు సౌర విద్యుత్తును ప్రోత్సహించడం, రైతులకు సోలార్ పంప్‌ల కోసం 75 శాతం రాయితీ కల్పించాలని మా ప్రయత్నం. పది సంవత్సరాల క్రితం పంపిణీ నష్టాలను విజయవంతంగా 15 శాతం దిగువకు తీసుకురావడంలో చూపించిన శ్రద్ధ, చొరవ ఆ తదనంతర కాలంలో చూపించకపోవడాన్ని ఇప్పుడు చూపించడమవుతుందని గమనించనగును. విద్యుత్తు రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించి, పర్యవేక్షించడం ద్వారా సబ్ స్టేషన్ స్థాయిలో నా ప్రభుత్వం దానికి తగిన విధంగా పారదర్శకమైన యంత్రాంగాన్ని కలిగివుంటుంది. సమాచార యుగంలో నాయకత్వ, ఉత్కృష్ట స్థితిని పొందడానికి, తనంతతానుగా విజ్ఞాన సమాజంలోకి పరివర్తన చెందడానికి నా ప్రభుత్వం సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుంటుంది. సమాజంలోని అన్ని వర్గాలలోని సామాన్య మానవుని ప్రయోజనం కోసం నా ప్రభుత్వం, సరళ, నీతివంతమైన, జవాబుదారీ, బాధ్యతాయుత, పారదర్శకత(స్మార్ట్) పరిపాలనను అందిస్తుంది. హైదరాబాదులో చారిత్రాత్మకమైన సైబర్ సిటీని నిర్మించిన ప్రతిష్ఠాకరమైన క్షణాలు, ఇప్పటికీ మా జ్ఞాపకాలలో నిక్షిప్తమయినవి. రాష్ట్రంలో సమకాలీన రూపాంతరాల సైబర్ సిటీలు అనేకం ఏర్పాటు చేయాలని నా ప్రభుత్వం ప్రణాళిక చేస్తున్నది. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన కోసం తాజా

సాంకేతిక పరిణామాలు, సోషల్ మీడియా, క్లౌడ్ & మొబైల్ టెక్నాలజీలను మేము వినియోగించుకుంటాం.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల క్రింద ప్రయోజనాలను పటిష్ఠంగా అందించడంకోసం, ఐ.టి సేవలను విస్తృతంగా వినియోగించు కోవడమవుతుంది. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో, ఐ.టి. వృత్తి నిపుణులను క్రియాశీల భాగస్వాములుగా చేయడమవుతుంది. ఐ.టి. రంగం వృద్ధిని ముందుకు తీసుకు వెళ్ళడానికి విశాఖపట్నం, తిరుపతి వద్ద ఒక్కొక్కటిచొప్పున రెండు సమాచార సాంకేతిక విజ్ఞానం పెట్టుబడి ప్రాంతాలను (ఐటిఐఆర్ఎస్) అనంతపురము, విజయవాడల వద్ద రెండు భారీ ఐటి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికను రూపొందించడమవుతున్నది. టెలీకమ్యూనికేషన్ రంగం కోసం ఎలక్ట్రానిక్ పరికరాలు / సామాగ్రి తయారీ కోసం హార్డ్‌వేర్ పార్కులు ఏర్పాటు చేయాలని దృష్టి సారించడమవుతుంది.

పట్టణ రంగంలో నీటి సరఫరా, మురుగునీరు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, రీసైక్లింగ్, ఆర్థికంగా భరించగలిగే గృహ నిర్మాణం, రవాణా వంటి కీలకమైన రంగాలలో మౌలిక సౌకర్యాల అభివృద్ధిలో పెద్ద ఎత్తున పెట్టుబడుల అవసరమున్నది. అన్ని జిల్లాలకు హైస్పీడ్ రైలు అనుసంధానాన్ని కల్పించడమవుతుంది. తీరప్రాంత పట్టణాలలో వాటి నీటి అవసరాలను పెంపొందించడం కోసం సముద్రపు నీటి నుండి లవణాన్ని తొలగించే ప్లాంట్‌లను ఏర్పాటు చేయడమవుతుంది.

ఎన్నికల హామీలను నెరవేర్చే బలమైన నిబద్ధతలో భాగంగా రైతులు, డ్వాక్రా మహిళల రుణాల రద్దు, పింఛను మొత్తాలను పెంచడం, ఎన్.టి.ఆర్. సుజల స్రవంతి పథకం క్రింద ప్రైవేటు రంగంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా రూ. 2/- లకు 20 లీటర్ల మినరల్ నీటిని అందించడం, గ్రామాలలో బెల్టు షాపులను మూసివేయడం, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచడానికి సంబంధించిన ఐదు అంశాలపై నా ప్రభుత్వం నిర్ణయాలను ప్రకటించిందని ప్రతిష్ఠాకరమైన సభ గుర్తించనగును. ఈ ప్రకటనలు పరిపూర్ణమైన అభివృద్ధి వ్యూహంలో భాగంగా వున్నాయి. త్వరలో ఇవి వాస్తవరూపం దాలుస్తాయి.

విభజన తదనంతరం ఉద్యోగుల మనసులలో అనేక రకాల అనుమానాలు, ఆందోళనలు పెరిగాయి. అత్యంత నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవ చేయడానికి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నా ప్రభుత్వం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. వ్యక్తుల ఆయుర్దాయం, కార్యనిర్వహక సామర్థ్యంలో పెరుగుదలను పరిగణలోనికి తీసుకొంటూ నా ప్రభుత్వం పదవీ విరమణ వయస్సును 2 సంవత్సరాలు అంటే 58 సంవత్సరాలు నుండి 60 సంవత్సరాలకు పెంచింది. ఈ నిర్ణయంతో, పరిపాలనకు వెన్నుముకగా వున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేకించి ఈ క్లిష్ట సమయంలో మరో రెండు సంవత్సరాలు ప్రజలకు సేవలందించేందుకు వారి అనుభవాన్ని వినియోగించే అవకాశం ఉంటుంది. అయితే, దాంతో సమానంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల రెండింటిలో యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలను కల్పించటానికి, త్వరలోనే ప్రభుత్వ ఖాళీలను భర్తీ

చేసే చర్యలను చేపట్టడానికి శ్రద్ధవహిస్తాం. నా ప్రభుత్వం నిరుద్యోగ యువతకు భత్యాన్ని సమకూరుస్తుంది. వారి కెరీర్ అడ్వాన్స్‌మెంటు కోసం, జాతి నిర్మాణ ప్రక్రియలో వారిని బాధ్యతాయుత భాగస్వాములుగా చేయటానికి ఒక 'యువజన విధానాన్ని' రూపొందించడమవుతుంది.

న్యాయోచిత, సుస్థిర మానవ వికాసాన్ని కట్టుదిట్టం చేయడం కోసం విద్యను ఒక కీలక దృక్పథంగా గుర్తించడమయింది. నా ప్రభుత్వం "అందరికీ విద్య" అనే అంశానికి కట్టుబడి లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తుంది. నా ప్రభుత్వం పేద విద్యార్థులందరికి కెజి నుండి పిజి వరకు ఉచిత విద్యను సమకూరుస్తుంది. యువతకు ప్రత్యేకించి మహిళలకు సాధికారత నిమిత్తం నాణ్యమైన విద్యను, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచటానికి ప్రత్యేక చర్యలను చేపట్టడమవుతుంది. దీనికితోడు, మెరుగైన జీవనోపాధి అవకాశాలను సాధించేందుకు, సమాజంలో నెలకొన్న సామాజిక దురాచార నమ్మకాలను నిర్మూలించే విధంగా నూటికి నూరు శాతం అక్షరాస్యతను సాధించేందుకు నా ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్య అనేది అత్యంత ధీటైనదని మేము కూడా ధృడంగా భావిస్తున్నాము.

ఆరోగ్యకర సమాజాన్ని ఏర్పాటుచేయటానికి తల్లి, శిశువుల ఆరోగ్యంపట్ల తగినంత శ్రద్ధ చూపవలసిన అవసరం ఉంది. ప్రసూతి మరణ రేటు (ఎంఎంఆర్), శిశు మరణ రేటు(ఐఎంఆర్)ను తగ్గించేందుకు, శిశువుల ఆరోగ్య వృద్ధిని పెంపొందించడానికి కృషిలో భాగంగా సమగ్ర శిశు అభివృద్ధి పథక ప్రాజెక్టుల (ఐసిడిఎస్) క్రింద అంగన్‌వాడీల వద్ద గర్భిణీ మహిళ, పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారాన్ని సమకూరుస్తాం.

మెరుగైన ఆరోగ్య సదుపాయాలను అందించే కృషిలో భాగంగా, మరిన్ని వ్యాధులకు చికిత్సను సమకూర్చటానికి ఎన్‌టిఆర్ ఆరోగ్య కార్డు పథకం క్రింద ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించాలని ప్రతిపాదించాం. ముందస్తు చెల్లింపు భారం లేకుండా జాబితాలో చేర్చిన కార్పొరేటు, ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో రూ. 2.5 లక్షల వరకు శస్త్ర చికిత్సలతోపాటు ఉచిత చికిత్సలను అందించాలని ప్రతిపాదించాం.

మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచటానికి రెండు ముఖ్యమైన పథకాలను ప్రవేశ పెట్టాలని నా ప్రభుత్వం ప్రతిపాదించింది. మహాలక్ష్మి పథకం క్రింద అర్హతగల కుటుంబాల నవజాత ఆడ శిశువుకు రూ. 30,000/-లను బ్యాంకులో డిపాజిట్ చేయడమవుతుంది. పండంటి బిడ్డ పథకం క్రింద పేద గర్భిణి మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారం కోసం రూ. 10,000/-ల మొత్తాన్ని సమకూర్చడమవుతుంది.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని నా ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. అందుచేత శిక్షణ, ఆర్థిక సహాయం, ప్రత్యేక పారిశ్రామిక యూనిట్ల కోసం కుటీర లక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టాలని ప్రణాళికను రూపొందిస్తున్నది.

వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాలకు చెందిన ప్రజల పట్ల ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటాం. నా ప్రభుత్వం బిసి డిక్లరేషన్‌కు అనుగుణంగా, బిసిల కోసం ఒక ప్రత్యేక బడ్జెటును అమలు చేస్తుంది. బిసి ఉపప్రణాళికను

ప్రవేశపెట్టి, అమలుపరుస్తాం. బిసి ప్రయోజనాలకు ఆటంకం లేకుండా కాపు కులానికి రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలించాలని నా ప్రభుత్వం ఒక కమీషన్‌ను ఏర్పాటు చేస్తుంది. సమగ్ర, సంఘటిత అభివృద్ధి అజెండాలో భాగంగా, చేతివృత్తులు, నేత కార్మికులు, నేతకారులు, మత్స్యకారులు, రజకులు, గొర్రె కాపరులు, వడ్డెరులు, ఇతర వెనుకబడిన తరగతుల సమూహానికి వివిధ సంక్షేమ పథకాలను అమలుచేస్తాం.

షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు విద్యను ప్రోత్సహించడానికిగాను స్కాలర్‌షిప్‌లను సమకూర్చాలని ఉద్దేశిస్తున్నాం. ఎస్‌సిఎస్‌పి/టిఎస్‌పి చట్టాన్ని ఖచ్చితంగా అమలుపరుస్తాం. పరిశ్రమలను నెలకొల్పటానికి ఎస్‌సి పారిశ్రామికవేత్తలను నా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఎంఎస్‌ఎంఇ రంగానికి వెంచర్ క్యాపిటల్ సౌకర్యాన్ని కల్పిస్తాం. అర్హతగల ఎస్‌సి కుటుంబాలకు రెండు ఎకరాల భూమిని సమకూర్చాలని కూడా అనుకొంటున్నాం.

గిరిజన వర్గానికి చేయూతనందించడానికి కృషిలో భాగంగా భూమిలేని గిరిజన కుటుంబాలకు రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని అనుకొంటున్నాం. అర్హతగల ఎస్‌టి తండాలను పంచాయతీలుగా గుర్తించడమవుతుంది. 50 సంవత్సరాలు దాటిన పేద గిరిజనులకు నెలకు రూ. 1000/-లు పింఛన్‌ను అందించాలని కూడా మేము అనుకొంటున్నాం. కెజీ నుండి పిజీ స్థాయి వరకు గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమవుతుంది. ఎస్‌టిల కోసం ప్రత్యేకంగా ఒక కమీషన్‌ను ఏర్పాటు చేసి, ఒక గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని మేము ఉద్దేశిస్తున్నాం.

మహాత్మాగాంధీ జన్మదిన చిహ్నంగా 2014, అక్టోబరు 2వ తేదీ నుండి సామాజిక భద్రతా పింఛన్‌ను నెలకు రూ. 200/- ల నుండి రూ. 1000/- లకు పెంచడానికి మేము నిర్ణయించాం. ఐదంచెల పెంపుదలతో దారిద్ర్యరేఖకు దిగువునవున్న వారికి సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ సంవత్సరానికి రూ. 5,000 కోట్ల కన్నా ఎక్కువగా వ్యయమయ్యే అతిపెద్ద సంక్షేమ పథకంగా ఉంటుంది. 80 శాతంకన్నా ఎక్కువ అంగవైకల్యం కలిగివున్న వికలాంగులకు నెలకు రూ. 500/-ల నుండి రూ. 1500/-లకు పెంచిన పింఛన్ వారికి అతిపెద్ద సహాయంగా ఉంటుంది.

నా ప్రభుత్వం అభివృద్ధి ప్రక్రియలో మైనారిటీలను భాగస్వాములుగా చేయడానికి అవసరమయిన చర్యలను తీసుకుంటుంది. మేము అన్ని మతస్థుల మతసంబంధమైన ప్రాంతాలకు, వారి ఆస్తులకు కట్టుదిట్టమైన రక్షణ, భద్రతను కల్పిస్తాం. ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షించడమవుతుంది.

పటిష్టవంతమైన పరిపాలనను అందించడానికి, నా ప్రభుత్వం ఆన్‌లైన్ ఫైల్ మానిటరింగును చేపడుతుంది. సమర్థవంతమైన, పారదర్శక పర్యవేక్షణా యంత్రాంగం అమలులో వుండేటట్లు చూస్తుంది.

నా ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. మొబైలు నెట్‌వర్క్ ద్వారా ఆపదలో వున్న మహిళ నుండి అందిన ఫిర్యాదుల మేరకు స్పందించడానికి ఒక యంత్రాంగాన్ని, వ్యవస్థను ఏర్పాటుచేస్తుంది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా మహిళలపై అత్యాచారాలకు

పాల్పడుతున్నట్టు గుర్తించిన అపరాధి అయిన వారిపై సత్వర, త్వరిత చర్యలను చేపట్టడమవుతుంది.

శాంతి, భద్రతలను కాపాడటానికిగాను, నా ప్రభుత్వం ప్రస్తుతమున్న చట్టాలను సమర్థవంతంగా అమలుపరచి, నిఘాను పటిష్ఠవంతం చేస్తుంది.

పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై దృష్టిసారించడానికి రాష్ట్రమంతటా సమీకృత మౌలిక సదుపాయాన్ని ప్రారంభించడమవుతుంది. మేము నీటి కనక్షన్, మరుగుదొడ్డి సౌకర్యం, 24 గంటల (24X7) విద్యుత్తు సరఫరా కల్పిస్తూ ప్రతి కుటుంబానికి ఒక పక్కా గృహం ఉండేటట్లు కృషి చేస్తాం.

ప్రకృతి వనరులపై అభివృద్ధిపరమయిన వత్తిడిని తగ్గించేందుకు పర్యావరణ అనుకూల, ఇంధన సమర్థత, ఆకర్షణీయ హరిత కార్యకలాపాలను ప్రోత్సహించడమవుతుంది. సుస్థిర అభివృద్ధి కోసం వాతావరణ మార్పు అంశాలపై ఒక రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించడమవుతుంది.

మన రాష్ట్రం యొక్క అధిక వృద్ధి సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి వ్యవసాయం, పరిశ్రమ, సేవలు అనే మూడు రంగాలన్నింటిలో ఆర్థిక వృద్ధిని పురికొల్పడానికి వ్యూహాలను రూపొందిస్తాం. కాలక్రమంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దక్షిణాది రాష్ట్రాలలో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలను మించి వేగంగా వృద్ధి చెందడానికి మరియు ఉజ్వలమయిన, సౌభాగ్యవంతమయిన ఆంధ్రప్రదేశ్ కోసం ప్రణాళికలను రూపొందించడమవుతుంది.

నేను పేర్కొనిన నా ప్రభుత్వ విధానపరమయిన చర్యలు విస్తృతమైన సూచికలుగా ఉంటాయి. అంతేకానీ ఉపయోగరహితమైనవికావు. ఒక నిబద్ధత, క్రమశిక్షణ గల కార్మిక శక్తిగా మెరుగైన నిర్వహణను కనబరుస్తున్న ఇతర రాష్ట్రాల చర్యలను మేము నేర్చుకొంటూ తద్వారా మెరుగుదల కనపరుస్తాం.

"జీవితంలో సంక్షోభాలు వస్తుంటాయి. వాటిని అవకాశంగా తీసుకోవాలి. సంక్షోభాలను ఇష్టపడి మార్పు కోసం వాటిని ఉపయోగించుకోవాలి." అనే విజ్ఞానవంతమయిన మాటలను గుర్తు చేసుకుందాం. కష్టపడి పనిచేసి ప్రస్తుత సంక్షోభాలను అవకాశంగా మలచుకొని నూతన వృద్ధి కోసం ప్రయాణం ప్రారంభిస్తాం. భారతదేశ ప్రభుత్వ క్రియాశీలక మద్ధతుతోను, ఆంధ్రప్రదేశ్ ప్రజల ధృడత్వం, సంకల్పంతో ఈ దేశంలో పురోగతిలోవున్న రాష్ట్రాల వృద్ధి ధోరణులను అందుకొని, జాతి నిర్మాణంలో పాలుపంచుకొంటామని హామీ ఇస్తున్నాను.

సగటు మనిషికి అన్ని సదుపాయాలను, వనరులను కల్పించేట్టి, ధరల పెరుగుదలను అదుపుచేయడానికి తక్షణ చర్యలను తీసుకొనేట్టి మరియు ఒక పారదర్శకమయిన జవాబుదారీ, అవినీతిరహిత పరిపాలన ద్వారా కట్టుదిట్టం చేస్తూ వారిలో విశ్వాసాన్ని పెంపొందించే ప్రభుత్వాన్ని కార్యరూపంలోకి తీసుకొని రావడానికి కృషిచేస్తాం.

ఇప్పుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం మనందరి లక్ష్యం.

"జై హింద్"

PRINTED BY THE COMMISSIONER OF PRINTING, STATIONERY AND STORES PURCHASE
AT THE GOVERNMENT SECRETARIAT PRESS ©, MINT COMPOUND, HYDERABAD.
2014